# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-12-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ప్రభుత్వ విధానాల అమలకు  కలెక్టర్ల సదస్సు దోహదపడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

2. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

3. పంటపొలాలకు సాగునీరును అందించేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపడుతోందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

4. ఆంధ్రప్రదేశ్ నూతన పర్యాటక విధానాన్ని విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం  ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది.

5. దీపం-2 పథకంలో భాగంగా ఇప్పటి వరకు 80 లక్షల మందికి పైగా ఉచిత సిలిండర్లు పొందారని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

==========================

ప్రభుత్వ విధానాల అమలుకు  కలెక్టర్ల సదస్సు  దోహదపడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి  అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు ఈరోజు ప్రారంభమైంది. ఇందులో భాగంగా భవిష్యత్ లక్ష్యాలపై కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ,

వాయిస్... 27 సెకన్లు

కాగా ఈ సదస్సు రేపు కూడా జరగనుంది.

-------------------------

ప్రజలకు సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుంటుందని  జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో పేదలకు వైద్య సహాయంగా విడుదల చేసిన  ముఖ్యమంత్రి  సహాయనిధి చెక్కులను  మంత్రి ఈరోజు అందజేసారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని తనకు నచ్చిన మిల్లర్లకు విక్రయంచే  వెసులుబాటు కల్పించిందని అన్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను అన్ని విధాల

ఆదుకుంటున్నామని, కౌలు రైతులకు ఈ క్రాప్ నమోదు సౌకర్యాన్ని కల్పించామని మంత్రి పేర్కొన్నారు.

-----------------------------

పంటపొలాలకు సాగునీరును అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లాలోని సోమశిల జలాలశయం పెద్ద కాలువను మంత్రి ఆ ఈరోజు పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

..వాయిస్.. 26 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్ నూతన పర్యాటక విధానం 2024 - 29ని విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే సంవత్సరం మార్చి 31తో పాత పర్యాటక విధానం ముగుస్తున్న దృష్ట్యా నూతన పర్యాటక పాలసీని ప్రభుత్వం రూపొందించింది. పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పిస్తూ స్వర్ణాంధ్ర టూరిజం పాలసీ -2029ని రూపొందించారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి, ఆర్థిక పురోభివృద్ధికి ప్రోత్సాహం, ఉద్యోగాల కల్పన, సాంస్కృతిక మార్పిడి సులభతరం చేసేలా నూతన పర్యాటక విధానం విధి విధానాల రూపకల్పన చేసినట్లు ప్రభుత్వం తెలిపింది.

-----------------------------

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ నెల 5వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌కు వేతనాలు, సామాగ్రి, పరిపాలన వ్యయం వంటి విభాగాల కింద 7వేల 2వందల 82 కోట్ల 41 లక్షల రూపాయల నిధులు విడుదల చేసినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ లోక్‌సభలో తెలిపారు.

-----------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, పత్రికా సంపాదకులు, తమిళ రచయిత సుబ్రమణ్య భారతి జయంతి ఈ రోజు. 1882వ సంవత్సరం డిసెంబర్ 11వ తేదీన తమిళనాడు రాష్ట్రం తూత్తుకుడి జిల్లా ఎట్టాయపురం గ్రామంలో జన్మించారు. ఆయన తిరునల్వేలి ..., వారణాసి పట్టణాలలో విద్యాభ్యాసం చేసి పాత్రికేయ రంగంలో ప్రవేశించారు. స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. బ్రిటిష్ వారి దాస్య శృంఖలాల నుండి దేశ విముక్తి కోసం అందరూ కృషి చేయాలని తన రచనల ద్వారా ప్రజలలో దేశభక్తిని కలిగించిన సుబ్రమణ్య భారతి 1921 సెప్టెంబర్ 12 వ తేదీన తుదిశ్వాస విడిచారు. కాగా ప్రధాన మంత్రి ఈ రోజు డిల్లీలో సుబ్రమణ్య భారతి రచనల సంకలనాన్ని ఆవిష్కరిస్తారు.

-----------------------------

దీపం-2 పథకంలో భాగంగా ఇప్పటి వరకు 80 లక్షల మందికి పైగా ఉచిత సిలిండర్లు పొందారని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇందులో 62 లక్షల 20 వేల సిలిండర్లు పంపిణీ చేశామని లబ్ధిదారుల ఖాతాల్లో 463 కోట్ల 82 వేల రూపాయలు జమ చేశామని వివరించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సిలిండర్ బుక్ చేసుకున్న వెంటనే పట్టణ ప్రాంతాల్లో 24 గంటలు, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లో ప్రజలకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 48 గంటల్లో రాయితీ నగదు జమ చేస్తున్నట్లు వివరించారు. ఏదైనా సమస్య ఉంటే 1967 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చని సూచించారు.

---------------------------

సాంకేతిక మార్పులకు అనుగుణంగా ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించే విధంగా విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో ముందుకు రావాలని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ కోరారు. తిరుపతి జిల్లా ఏర్పేడులోని భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థలో నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2024 కార్యక్రమాన్ని తిరుపతి శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణు దీక్షిత్‌తో కలిసి ఈ రోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ...

వాయిస్ .. 33 సెకన్లు

ఈ సందర్భంగా ఆయుర్వేదిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ .రేణు దీక్షిత్ మాట్లాడుతూ ..... జాతీయంగా, అంతర్జాతీయంగా ఆరోగ్యపరంగా ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయని అన్నారు. వీటిని ఎదుర్కొనే విధంగా పరిశోధనలు సాగాలని ఆమె తెలుపుతూ

వాయిస్... 23సెకన్లు

---------------------------

ప్రతి ఒక్కరూ సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం కోలుకుల గ్రామంలో నూతన దేవాలయ నిర్మాణానికి మంత్రి ఈ రోజు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామ సభల ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయలను కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈనెల 17వ తేదీన మంగళగిరిలోని అఖిల భారతీయ వైద్య విజ్ఞాన సంస్థ- ఎయిమ్స్‌లో జరిగే ప్రథమ స్నాతకోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొంటారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ తెలిపారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై నిన్న ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రపతి ఈ నెల 17వ తేదీన ఉదయం గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకొని అక్కడనుండి ఎయిమ్స్‌కు చేరుకుంటారని, స్నాతకోత్సవం అనంతరం గన్నవరం విమానాశ్రయానికి ప్రయాణమవుతారని ఆయన పేర్కొన్నారు. పర్యటనకు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలనిసంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

---------------------------

రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలా వీరాంజనేయ స్వామి తెలిపారు. విజయవాడలోని వరలక్ష్మి నగర్‌లో నూతనగా నిర్మించిన సామాజిక భవనాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 340 కోట్ల రూపాయలతో నూతన ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను నిర్మిస్తామన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జనవరి నెలలో రుణాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు.

---------------------------

ఈరోజు అంతర్జాతీయ పర్వతాల పరిరక్షణా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రకృతి మనకు అందించిన సహజ వనరులలో పర్వతాలు ఒకటి. మొదటి తరం నాగరికతా ఆనవాళ్ళు నదులు, పర్వతాలలోనే బయటపడ్డాయని చరిత్ర చెబుతోంది. పర్వతాలు అనేక జీవ జాతులకు నిలయంగా ఉంటున్నాయి. ప్రపంచ జనాభాలో 15 శాతం మంది వరకు ప్రజలు పర్వతాలవద్దనే నివసిస్తున్నారంటే... వీటి ప్రాముఖ్యత ఏమిటో విదితమవుతోంది.

======================